సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 26 । జనవరి । 2025



మునుగోడు అభివృద్ధే ముఖ్యం

పదవుల కంటే మునుగోడు నియోజకవర్గ ప్రజల బాగోగులు, అభివృద్ధే ముఖ్యమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 8లో



అభివృద్ధికి సహకరించాలి

యాదగిరిగుట్ట అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 9లో



సేవ చేయడం గొప్ప అవకాశం

ప్రజలకు సేవ చేయడం గొప్ప అవకాశంగా భావించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు వేళాయె



సిద్ధమైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

భువనగిరి : గణతంత్ర వేడుకలకు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సిద్ధమైంది. ఉదయం 9 గంటలకు కలెక్టర్ హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాటుతో పాటు శకటాలను ప్రదర్శించనున్నారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ, విద్యార్థుల సాంస్కృతి ప్రదర్శనలు ఉంటాయి. అంతకుముందు 8 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించనున్నారు.

దరఖాస్తుల పరిశీలన

భువనగిరి, యాదగిరిగుట్ట రూరల్: భువనగిరి మండలంలోని బండసోమారం గ్రామ పంచాయతీ కార్యాలయం, యాదగిరిగుట్ట మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని శనివారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ సలీం, ఏఓ సుధారాణి తదితరులు ఉన్నారు.

నృసింహుడికి పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకుని శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అర్చకుల వేదమంత్రాల మధ్య తులసీదళాలు, తీరొక్క పుష్పాలతో అర్చన చేశారు.ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి.

నాలుగు పథకాలు నేటినుంచి అమల్లోకి

భువనగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న నాలుగు సంక్షేమ పథకాలు ఆదివారం నుంచి అమల్లోకి రానున్నాయి. వీటిని రిపబ్లిక్ డే సందర్భంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 17 మండలాల నుంచి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు.

ఎంపిక చేసిన గ్రామాలివే..

మంతపురి, తిమ్మాపూర్, కదిరేనిగూడెం, బూర్గుపల్లి, బోయినిపల్లి, కోనాపూర్, సైదాపూర్, బురుజుబావి, బండసోమారం, బ్రాహ్మణపల్లి, వంకమామిడి, న్యాతాల్లగూడెం, కోతులాపురం, మాసిగూడెం, ఉత్తటూరు, మానాయికుంట, పాటిమట్ల గ్రామాలను ఎంపిక చేశారు.

హక్కులపై అవగాహన

భువనగిరి టౌన్ : జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో శనివారం న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు హాజరై ఖైదీలకు రాజ్యాంగ హక్కులు, న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. భువనగిరిలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయం ద్వారా ఉచిత న్యాయ సహకారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవిలత, అదనపు సీనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత పాల్గొన్నారు.

'విపక్షాలది తప్పుడు ప్రచారం'


సాక్షి,యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి చిత్తశుద్ధి ఉంటే ప్రధాని నరేంద్రమోదీని, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి మార్పించే ప్రయత్నం చేయాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. అలైన్‌మెంట్ మార్పునకు తాము వ్యతిరేకం కాదని, బాధితుల పక్షాన సహకరిస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయంగా పబ్బం గడుపుకునేందుకు అలైన్‌మెంట్ అంశాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు.

దేశ అభివృద్ధి, సమగ్రతలో మన భాగస్వామ్యం

- రాజ్యాంగం కల్పించిన అవకాశాలు, హక్కులతో రూపుమారిన గ్రామాలెన్నో..
- సంక్షేమం, అభివృద్ధిలో ముందడుగు
- స్వశక్తితో ప్రగతిబాట



మన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ హక్కులు, అవకాశాలు కల్పించింది. రాజ్యాంగం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకుని ఎందరో తమకుతాము తీర్చిదిద్దుకుని ఎదిగారు. అంతేకాకుండా దేశ సమగ్రతలో కూడా భాగస్వాములు అవుతున్నారు. మన ఉమ్మడి జిల్లాలో అనేక పల్లెలు సహజ పద్ధతులు అవలంబించి వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నాయి. మహిళలు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. పలువురు యువకులు దేశ రక్షణకు పూనుకుని సైన్యంలో చేరుతున్నారు. భారత రాజ్యాంగం 75 వసంతాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో.. రాజ్యాంగం నీడలో ఎదిగిన గ్రామాలు, సంస్థలపై ప్రత్యేక కథనం..



వీరేపల్లి సుబ్బారావు

తొలి వేడుకల్లో పాల్గొనడం మరచిపోలేను

కోదాడ: తొలి స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం జీవితంలో మరచిపోలేను అని కోదాడ మండలం యర్రవరం మాజీ సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు తెలిపారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు రాజకీయ నేతల తీరు, ఎన్నికల నిర్వహణ, అధికారుల పని విధానంపై ఆయన మనోగతం.. నేను 1931లో కోదాడ సమీపంలోని యర్రవరంలో జన్మించాను. మా సోదరుడు వీరేపల్లి లక్ష్మీనారాయణ మంత్రిగా పనిచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు నాకు 15 ఏళ్లు. 8వ తరగతి చదువుతున్నాను. ఆ రోజు మా బడిలో మొదటిసారి నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలు మర్చిపోలేను. 10వ తరగతి తరువాత చదువు ఆపేశాను. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత జనవరిలో నిర్వహించిన తొలి గణతంత్ర వేడుకల్లోనూ పాల్గొన్నాను. ఇలా రెండు వేడుకల్లోనూ పాల్గొనడం ఎన్నటికీ మరచిపోలేను. భారత రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యంతో కోదాడ మార్కెట్ డైరెక్టర్‌గా, యర్రవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా, కోదాడ ఎంపీటీసీ సభ్యుడిగా, 90 ఏళ్ల వయస్సులో యర్రవరం సర్పంచ్‌గా పనిచేశాను.

ఎన్నికల ఖర్చుకు చందాలు సేకరించేవారు

రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత జరిగిన ఎన్నికల్లో నాయకులు ఖర్చుల కోసం ప్రజల నుంచి చందాలు సేకరించి పోలింగ్ అనంతరం వాటికి లెక్కలు చెప్పేవారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసేవారు కాదు. నాయకులు విలువలు కలిగి ఉండేవారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు వేసేవారు. అధికారులు నిజాయితీగా ఉండేవారు, చిత్తశుద్ధితో పని చేసేవారు. ఇప్పుడు అవినీతి పెరిగింది. ఇక ఇప్పుడు రాజకీయాల్లో డబ్బే ప్రధానమైంది. నిజాయితీగల వారు, విద్యావంతులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో నిబద్ధతలేనివారు నేతలుగా మారుతున్నారు. అధికారుల్లో జవాబుదారీ తనం లోపించింది.



రూపుమారిన 'పాగిళ్ల'

పాగిళ్ల గ్రామ వ్యూ

చందంపేట : ఒకటి ముంపు నిర్వాసితులు.. కష్టాన్నే నమ్ముకున్న కర్షకులు.. రాళ్లు, రప్పలతో ఉన్న ప్రాంతాన్ని శ్రమకోర్చి చదును చేశారు. సాగుకు వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితిని అధిగమించారు. పక్కనే ఉన్న సాగర్ బ్యాక్ వాటర్ నుంచి పైప్‌లైన్లు వేసుకుని వాణిజ్య పంటల సాగు చేపట్టి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు చందంపేట మండలం పాగిళ్ల గ్రామ రైతులు. కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. దీంతో గ్రామ రూపురేఖలు సైతం మారాయి. అప్పట్లో గుడిసెలతో కనిపించే ఈ గ్రామంలో ఇప్పుడు పక్కా ఇళ్లు ఉన్నాయి. గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ వంటి వసతులు సైతం సమకూరాయి.

రాజావారి కోటలో త్రివర్ణ పతాకం రూపకల్పన

కోదాడ: నడిగూడెం రాజావారి కోటలో జాతీయ జెండా రూపుదిద్దుకుంది. దీనిని పింగళి వెంకయ్య తయారు చేశారు. మునగాల పరగణా కేంద్రంగా నడిగూడెం సంస్థానం ఉండేది. దీని కింద 43 గ్రామాలు ఉండేవి. వీటికి బహద్దూర్ రాజానాయిని వెంకటరంగారావు అధిపతిగా ఉండేవారు. ఈ కోటను ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో 30 అడుగుల ఎత్తు ప్రహరీతో నిర్మించారు. కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య రాజావారి కోటలో వ్యవసాయ అధికారిగా 1915 నుంచి 1921 వరకు పనిచేశారు.


జాతీయోద్యమ స్ఫూర్తితో..

గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగింది. ఈ క్రమంలో వివిధ దేశాల్లో పర్యటించిన అనుభవం ఉన్న పింగళి వెంకయ్య దేశానికి కూడా జెండా కావాలని భావించి త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. 1916లో లక్నోలో జరిగిన భారతజాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఈ జాతీయ జెండాను ఎగురువేశారు. 1919లో జలంధర్‌కు చెందిన లాలా హన్స్‌రాజా జాతీయ పతాకంపై రాట్నం చిహ్నం ఉంటే బాగుంటుందని సూచించడంతో గాంధీ అంగీకరించారు. 1921లో బెజవాడలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న గాంధీ.. వెంకయ్యను పిలిపించి త్రివర్ణ పతాకంలో రాట్నం చేర్చాలని సూచించారు. దీంతో రాట్నం చేర్చి 1921 మార్చి 31న వెంకయ్య జాతీయ పతాకాన్ని తయారు చేశారు. ఈ సమావేశాల్లో ఈ జెండా ఎగుర వేశారు. 1947 జూలై 22న భారత రాజ్యాంగ సభలో నెహ్రూ ఒక తీర్మానం చేస్తూ జాతీయ పతాకంలో రాట్నం స్థానంలో అశోకుని ధర్మచక్రం చేర్చాలని నిర్ణయించారు. ఈఒక్క మార్పు తప్పా జాతీయ జెండాలో నేటి వరకు ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ జెండా 2021మార్చి 31తో వందేళ్ల పూర్తి చేసుకుంది.



కోటలో 110 అడుగుల జెండా ఏర్పాటుకు సన్నాహాలు

నడిగూడెం రాజావారి కోటలో 110 అడుగుల జాతీయ జెండా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ట్రయల్ కూడా నిర్వహించారు. మార్చిలో రాష్ట్రపతి చేత దీనిని ఆవిష్కరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



దేశరక్షణలో బొందుగుల, ఏదుళ్లగూడెం

రాజాపేట, వలిగొండ : దేశరక్షణ కోసం సరిహద్దులో విధులు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు బొందుగుల, ఏదుళ్లగూడెం యువకులు. దేశభక్తి, తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం సరిహద్దులో తుపాకీ పట్టి దేశాన్ని కాపాడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామంలో ఇప్పటి వరకు 30 మందికిపైగా యువకులు ఆర్మీలో చేరారు. వారిలో ఇప్పటి వరకు ఎనిమిది మంది రిటైర్డ్ అయ్యారు. ఒకే గ్రామం నుంచి 30 వరకు యువకులు ఆర్మీలో చేరడం గర్వంగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బొందుగుల నుంచి ఆర్మీలో చేరిన వారు..

తరిగొప్పుల చంద్రశేఖర్, బాల్ద మల్లేశం, అంబాల శివకుమార్, కొమ్ము మల్లేశం, పొన్నబోయిన భరత్, రాము, బాల్ద అనిల్, గుండగోని శివ, పాండు, కొమ్ము మల్లేశంతోపాటు మరికొందరు ఉన్నారు. మరికొంత మంది రిటైర్డ్ అయ్యారు. నరేందర్, పవన్‌కుమార్‌రెడ్డి మృతి చెందారు.



ఏదుళ్లగూడెం గ్రామ వ్యూ

ఏదుళ్లగూడెంలో 13 మంది

వలిగొండ మండలం ఏదుళ్లగూడెం నుంచి 13 మంది ఆర్మీలో చేరారు. గూడూరు దామోదర్‌రెడ్డి మొదటగా 1981లో సైన్యంలో చేరారు. ఆయనతో చదువుకున్న పెద్దబోయిన వెంకటేశం, బండిగారికృష్ణ చేరారు. వారితోపాటు బోయపెల్లి లింగారెడ్డి, బోధపట్ల నారాయణరెడ్డి, కొలను సురేందర్‌రెడ్డి, వెంకటేశం, గూడూరు మల్లారెడ్డి, బండిగారి వెంకటేశం, కొంతం రమేష్, ఇమ్మడి నరసింహ, బండిగారి రమేష్ ఆర్మీలో చేరారు. ప్రస్తుతం వీరంతా రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం బొక్క శ్రీనివాస్‌రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు.



ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న బొందుగులకు చెందిన శివకుమార్

మహిళా శక్తికి 'ధీశాలి'



సేంద్రియ సాగుపై అవగాహన పొందుతున్న మహిళలు

బొమ్మలరామారం : మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తోంది ధీశాలి మహిళ రైతు ఉత్పత్తిదారుల లిమిటెడ్. బొమ్మల రామారం మండలంలోని 12 గ్రామాల్లోని 716 మహిళలతో గ్రామీణ మహిళా మండలి (జీఎంఎం) అధ్యక్షురాలు దూబల విజయలక్ష్మి 2017-18లో ధీశాలి మహిళ రైతు ఉత్పత్తిదారుల లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేశారు. మహిళలకు చేయూత అందిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని నిరూపిస్తూ ఏడు సంవత్సరాలో ఈ సంస్థ రూ.46 లక్షల టర్నోవర్ సాధించింది.

నాబార్డ్ సహకారం..

నాబార్డ్ సహకారంతో ఇన్‌పుట్ ఫర్టిలైజర్ ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఫుడ్ ప్రాసెసింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ, వారు పండించిన కూరగాయలు వారే మార్కెటింగ్ చేస్తారు. ఈ సంస్థలోని పని చేస్తున్న 20 మంది మహిళా రైతులకు ఖేతి పథకం ద్వారా 85 శాతం సబ్సిడీతో రూ.93 వేల విలువైన షేడ్ నెట్ హౌజ్‌లను అందించారు. ఇక.. కూరగాయల ధర తగ్గిన రోజుల్లో మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్, సోలార్ డ్రైయర్‌లో కూరగాయలు ఆరబెట్టడం, టమాట సాస్, నిల్వ పచ్చళ్ల తయారిపై శిక్షణ ఇస్తోంది.

దేశరక్షణలో 'పీఈఎల్'



యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ (పీఈఎల్) భారతదేశ రక్షణలో తమవంతు పాత్ర పోషిస్తోంది. అంతేకాకుండా శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికి ప్రొపలెంట్ బూస్టర్ ఇస్తూ.. శాస్త్రవేత్తల ప్రయోగాలకు సహకరిస్తోంది. 1985లో మైనింగ్ ఎక్స్‌ప్లోజివ్ పేరుతో ఈ పరిశ్రమను మొదలు పెట్టారు. ఆ తర్వాత ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్‌గా పేరు మార్చారు. 2004 నుంచి డిఫెన్స్, స్పేస్ (రక్షణ, అంతరిక్షం) రంగాలకు పీఈఎల్ తన సేవలను అందిస్తోంది. పీఎస్‌ఎల్‌వీ, రాకెట్ సిరీస్, ఆకాష్, ఎంఆర్ సామ్, అస్త్ర వంటి రాకెట్ మిస్సైల్స్‌కు ప్రొపల్సిన్ సిస్టమ్‌లను పీఈఎల్ తయారు చేసింది. దీంతో పాటు త్రివిధ దళాలైన ఎయిర్ ఫోర్స్, ఆర్మీ, నావి డిపార్ట్‌మెంట్లు యుద్ధాల్లో వాడే ఉత్పత్తులను ఈ పరిశ్రమ తయారు చేసి ఇస్తుంది. ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగంలో రాకెట్‌పైకి వెళ్లడానికి ఉపయోగించే సాలిడ్ ప్రొపలెంట్ బూస్టర్లను కూడా పీఈఎల్ ఉద్యోగులు తయారు చేశారు. ఇవే కాకుండా, దేశానికి ఉపయోగపడే ఉత్పత్తులను రక్షణ, అంతరిక్ష సంస్థలకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని పీఈఎల్ యాజమాన్యం చెబుతోంది. దీంతో పాటు ఆత్మనిర్భర్, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలకు కూడా తమ ఉత్పత్తులను పంపుతున్నట్లు పేర్కొంది.



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో జాతీయ గీతాలాపన..

నిత్యం జాతీయ గీతాలాపన

రామగిరి(నల్లగొండ) : యువత, చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించాలనే సంకల్పంతో ఆవిర్భవించిన జనగణమన ఉత్సవ సమితి జిల్లాలోని పలు చోట్ల నిత్యం జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మొదటగా నల్లగొండలో 2021 జనవరి 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రధాన కూడళ్లలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలీసు శాఖ, ఉత్సవ సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయి. రోజూ ఉదయం 8.30 గంటలకు అన్ని కూడళ్లలో ఒకేసారి జాతీయ గీతాలాపన నిర్వహిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల..

నల్లగొండ జిల్లా పలుచోట్ల నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం సాగుతోంది. మొదటగా నల్లగొండ పట్టణంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం తిప్పర్తి, నార్కట్‌పల్లి, త్రిపురారంలో కూడా కొనసాగుతోంది. భవిష్యత్‌లో మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా పట్టణాల్లో నిర్వహించేందుకు ఉత్సవ సమితి సభ్యులు ప్రయత్నిస్తున్నారు.



భూ నిర్వాసితులు, నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేస్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

'రీజినల్' భూ నిర్వాసితుల ధర్నా ఉద్రిక్తత

భువనగిరిటౌన్ : రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన మహాధర్నా ఉద్రిక్తంగా మారింది. భూ నిర్వాసితులు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారు. ఆగ్రహించిన నిర్వాసితులు, నాయకులు హైవేపై ధర్నాకు దిగారు. రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సుమారు 200 మంది పోలీసులు కలెక్టరేట్ పరిసరాలను దిగ్బంధనం చేశారు. పోలీసుల అనుమతితో బీజేపీ ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, క్యామ మల్లేశ్, చింతల దామోదర్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, పాశం భాస్కర్, కంచర్ల రామకృష్ణారెడ్డి, జడల అమరేందర్‌తో పాటు మరికొందరు కలెక్టరేట్‌లోపలికి వెళ్లి అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మారుస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట మార్చారని విమర్శించారు. పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఓట్లకోసం రైతులను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ ధర్నాకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు భయానక వాతావరణం సృష్టించడం తగదన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అధికారుల చేతుల్లోకి పాలన

నేటితో ముగియనున్న మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం

- ప్రత్యేక పాలనకు కసరత్తు పూర్తి

సాక్షి యాదాద్రి : మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో ముగియనుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమించనున్నారు. దీనికి సంబంధించి మున్సిపల్ శాఖ కసరత్తు పూర్తి చేసింది. మున్సిపల్ కమిషనర్లను ప్రత్యేకాధికారులుగా కొనసాగిస్తారా? ఇతరులకు బాధ్యతలు అప్పగిస్తారా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. నేడు సాయంత్రం ప్రత్యేకాధికారులను కలెక్టర్ నియమించనున్నారు.



ఒకటి పాతది, ఐదు కొత్తవి

జిల్లాలో భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో భువనగిరి మున్సిపాలిటీ తప్ప మిగతా ఐదు కొత్తగా ఏర్పడ్డాయి. మున్సిపాలిటీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరగగా అదే నెల 26న పాలకమండళ్లు కొలువుదీరాయి. అన్ని చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందింది.

మారిన రాజకీయం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రాజకీయాలు ఒక్కసారిగా మలుపుతిరిగాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. పట్టు పెంచుకునే క్రమంలో మున్సిపాలిటీలపై దృష్టి సారించింది. మున్సిపల్ పీఠాలను తన ఖాతాలో వేసుకునేందుకు అవిశ్వాస తీర్మానాలకు తెరలేపింది. అనుకున్న విధంగానే భువనగిరి, మోత్కూరు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆ రెండు కాంగ్రెస్ వశమయ్యాయి. ఇక యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్లు హస్తం గూటికి చేరారు. ఆలేరు, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో ఆ రెండు బీఆర్‌ఎస్ ఖాతాలోనే ఉన్నాయి.

ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్

భువనగిరి : ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్ ఉంటుందని, దీనిని అందరూ గుర్తుంచుకుని ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భువనగిరిలో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నవీన్ కుమార్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భువనగిరిలో ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, డీసీపీ, అధికారులు, నాయకులు

క్లుప్తంగా

కుంటలో పడి వృద్ధురాలు మృతి

దేవరకొండ: దేవరకొండ పట్టణ శివారులోని తుల్చమ్మ కుంటలో పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన శనివారం జరిగింది. ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న కంభంపాటి సాయమ్మ (80)కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నిరంజన్ నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి సాయమ్మ మానసికంగా కుంగిపోయింది. శుక్రవారం సాయమ్మ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉంటే దేరకొండ పట్టణ శివారులోని తుల్చమ్మ కుంటలో శనివారం సాయమ్మ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తురాలి మనుమడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్యువెలరీ షాపు యజమాని కోసం ముమ్మర గాలింపు

- రాజస్తాన్‌కు రెండు పోలీస్ బృందాలు
- ఇప్పటికే 140 మంది బాధితుల ఫిర్యాదు

యాదగిరిగుట్ట: ప్రజలు కుదవపెట్టిన బంగారంతో పాటు భారీగా అప్పులు చేసి పారిపోయిన యాదగిరిగుట్ట పట్టణంలోని జైభవానీ జ్యువెలరీ షాపు యాజమాని జిత్తు కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ జిత్తును పట్టుకోవడానికి ఇద్దరు ఎస్ఐలతో కూడిన ప్రత్యేక బృందాలను శనివారం రాజస్తాన్‌కు పంపించారు. గురువారం రాత్రి జిత్తు దుకాణానికి తాళాలు వేసి, కుటుంబ సభ్యులతో సహా వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు 140మంది బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయని, జిత్తు వద్ద 3 కిలోల 100 గ్రాముల బంగారం కుదువపెట్టగా.. రూ.1.20కోట్ల వరకు అప్పులు తీసుకున్నట్లు తెలుస్తోందని సీఐ రమేష్ వెల్లడించారు.

పీడియాట్రిక్ సర్జరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్‌లో అధునాతన వైద్య పరికరాలతో పీడియాట్రిక్ సర్జరీ సేవలను అందిస్తున్నామని, ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెస్టిక్యులర్ ట్యూమర్, హెర్నియా, హైడ్రోసెల్, హైపోస్పాడియాస్ శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని పిల్లలకు అధునాతన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

ఎంజీయూ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 30వ తేదీ నుంచి జరగాల్సిన పీజీ, లా, ఎంసీఏ పరీక్షలను వాయిదా వేసినట్లు యూనివర్సిటీ సీఓ ఉపేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాయిదా వేసిన పరీక్షలను ఫిబ్రవరి 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు సమాయత్తం అయ్యేందుకు సమయం కావాలని విద్యార్థుల అభ్యర్థన మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. అదేవిధంగా పీజీ మూడో సెమిస్టర్ ఎంబీఏ, ఎంబీఏ టీటీఎం తదితర పరీక్షలు కూడా వాయిదా పడినట్లు పేర్కొన్నారు.

మార్చిలోగా స్థానిక సంస్థల ఎన్నికలు


నల్లగొండలోని బీట్ మార్కెట్ వద్ద నూతన సబ్ స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ తదితరులు


నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: మార్చిలోగా గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు కూడా పూర్తవుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని బీట్ మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన సబ్ స్టేషన్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల కాలపరిమితి పూర్తయ్యిందని, మున్సిపల్ పాలకవర్గం కూడా ఆదివారంతో ముగుస్తున్నందున ప్రభుత్వం వాటికి త్వరలోనే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోందన్నారు. నల్లగొండ పట్టణంలో రూ.3 కోట్ల నిధులతో నెల రోజుల్లోనే 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించామని అన్నారు. వేసవిలో విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తామన్నారు. బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌ను నింపి కాల్వల ద్వారా నీరు అందిస్తున్నందున విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. నీలగిరి మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.500 కోట్లతో నీటి ట్యాంకులు, అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, సీసీ రోడ్ల పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ సమస్య ఏర్పడకుండా త్వరగా సబ్‌స్టేషన్‌ను నిర్మించిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, జూకూరి రమేష్, విద్యుత్ శాఖ సీఈ బాలస్వామి, ఎస్ఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

వైద్యులు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎక్కడైనా వైద్యుల పోస్టుల ఖాళీలు ఉంటే కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో స్కానింగ్ మిషన్లు ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం..

మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కలెక్టరేట్ పక్కనే రూ.36 కోట్లతో అదనపు బ్లాక్‌లు నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

- దీపారాధనతో ఉత్సవాలు పరిసమాప్తం
- చివరి రోజూ అధిక సంఖ్యలో సైదన్నను దర్శించుకున్న భక్తులు


జాన్‌పహాడ్ దర్గా పరిసరాల్లో భక్తులు

పాలకవీడు: జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శనివారంతో ముగిసింది. ముజావర్ జానీ ప్రత్యేక ప్రార్థనలు చేసి దీపారాధనతో ఉత్సవాలు ముగించారు. చివరి రోజు కూడా భక్తులు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా సమీపంలోని నాగుల పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సైదన్న నామస్మరణతో భక్తులు తిరుగు పయనమయ్యారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధి కారులు ఊపిరిపీల్చుకున్నారు. చివరి రోజు సుమారు ఇరవై వేల మంది భక్తులు దర్గాను దర్శించుకున్నారు. రెండు రోజులపాటు దర్గా పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. 64 మంది పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం దర్గా పరిసరాల్లో చెత్తాచెదారం తొలగిస్తున్నారు. దర్గా ప్రాంగణంలో అధికారులు ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక శిబిరాలను తొలగించారు. మెడికల్ క్యాంపు కొనసాగించాల్సిందిగా భక్తులు కోరారు. దర్గా వద్ద రాత్రి బస చేసిన దూర ప్రాంత భక్తులు పలువురు అనారోగ్య కారణాలతో మెడికల్ దుకాణాలను ఆశ్రయించాల్సి వచ్చిందని వాపోయారు. కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడపడంతో ఆర్టీసీకి మంచి ఆదాయం లభించింది. మిర్యాలగూడ డిపో నుంచి 18 బస్సుల ద్వారా 10,097 మంది జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లారని, రూ.4,00,200 ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

చింతపల్లి: హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం కానాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాటికొండ శ్రీనివాస్(50) చింతపల్లి మండలం గడియ గౌరారం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొక్కిరాలతండా వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పర్యాటకరంగంలో అపారమైన అవకాశాలు


మాట్లాడుతున్న శివనాగిరెడ్డి

నల్లగొండ టూటౌన్: పర్యాటక రంగంలో అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ పర్యాటక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యాటక రంగం అపార అవకాశాలు కల్పించడంతో పాటు సుస్థిర అభివృద్ధికి బాటలు వేస్తుందని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భిన్న భౌగోళిక, చారిత్రక ప్రదేశాలు ఉన్నందున అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం స్వతహాగా అవకాశాలను ఏర్పరుచుకుంటూ వినోదం, ఆహ్లాదం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మికత, ఆరోగ్యం వంటి రంగాల్లో విస్తరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, డాక్టర్ సబీనా హెరాల్డ్, డాక్టర్ మిర్యాల రమేష్, లక్ష్మీప్రభ, సూరం శ్వేత, ప్రవల్లిక, రామకృష్ణ, స్వప్న పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం


ఢిల్లీలో తడక రమేశ్, ఎన్నం శివకుమార్, బాలసుబ్రహ్మణ్యం దంపతులు

భూదాన్‌పోచంపల్లి, సంస్థాన్ నారాయణపురం: ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు తడక రమేష్ దంపతులు, ఎన్నం మాధవి-శివకుమార్ దంపతులతో పాటు చేనేత వస్త్ర ఉత్పత్తి సంస్థను నిర్వహిస్తున్న సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఆర్‌బీ బాలసుబ్రహ్మణ్యం, మాధవి దంపతులకు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. దీంతో వారు శనివారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఆదివారం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించే పరేడ్‌లో వీరు పాల్గొంటారు.

మునుగోడు అభివృద్ధే ముఖ్యం

- భగవంతుడి ఆశీస్సులు ఉంటే పదవులు అవే వస్తాయి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: 'నాకు పదవులు ముఖ్యం కాదు.. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం.. భగవంతుడి ఆశీస్సులు ఉంటే పదవులు అవే వస్తాయి' అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం చౌటుప్పల్ పట్టణంలో గాంధీజీ సుస్థిర విజ్ఞాన సదస్సును చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే.. గాంధీ విగ్రహానికి పూజలు చేసి నివాళులర్పించారు. సదస్సులో ఏర్పాటు చేసిన స్టాళ్లు, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పంట ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం రోజూ 16 గంటల పాటు పనిచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే గతంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని, తన త్యాగం వృథా కాలేదన్నారు. నియోజకవర్గానికి రూ.10 కోట్లు అడిగితే ఇవ్వని అప్పటి బీఆర్ఎస్ సర్కార్.. ఉప ఎన్నిక సమయంలో ప్రభుత్వమే మునుగోడు కాళ్ల వద్దకు వచ్చిందన్నారు. తాను బీజేపీలో ఉందామని భావించానని, ప్రజలంతా కాంగ్రెస్ వైపునకు వెళ్తుండగా తాను తిరిగి వచ్చినట్లు తెలిపారు. అధిష్టానం తనను ఎల్బీనగర్ నుంచి పోటీ చేయాలని సూచించిందని, అధికారంలోకి రాగానే మంత్రి పదవి సైతం ఇస్తామని హామీ ఇచ్చినా తనకు మునుగోడే కావాలని పట్టుబట్టానని గుర్తుచేశారు. రసాయన పరిశ్రమలు పోయినప్పుడే చౌటుప్పల్ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజల మేలుకోరి బెల్టుషాపులు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బెల్టుషాపుల మూసివేతతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి త్వరలోనే మంత్రిగా బాధ్యతలు తీసుకుంటారని, లేదంటే ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల గాంధీ వేషధారణ

సుస్థిర విజ్ఞాన సదస్సులో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలు, చిన్నారులు గాంధీ వేషధారణలు అలరించాయి. ట్రినిటీ స్కూల్ విద్యార్థుల నృత్యాలు, మలఖంబ్ క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాంధారి ప్రభాకర్, కేవీబీ కృష్ణారావు, మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల, కోశాధికారి పోలోజు శ్రీలత, మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఎండీ బాబాషరీఫ్, కొరగోని లింగస్వామి, బత్తుల రాజ్యలక్ష్మి, బండమీది మల్లేష్, అంతటి విజయలక్ష్మి, పోలోజు వనజ, ఆలె నాగరాజు, కాసర్ల మంజుల, కొయ్యడ సైదులు, బొడిగె అరుణ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను చూపిస్తున్న రాష్ట్రస్థాయి ఉత్తమ రైతు వాకిటి రజితారెడ్డి


చరఖా తిప్పుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


మహాత్మాగాంధీ విగ్రహాల ప్రదర్శన

● ఇక్కత్ కళ భేష్


కండెను పరిశీలిస్తున్న అమెరికాకు చెందిన ఐటీ ప్రొఫెషనల్, ఫొటోగ్రాఫర్ నెవిల్లే, విడితి చౌదరి

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు ఎంతో కళాత్మకంగా ఉన్నాయని అమెరికాకు చెందిన ఐటీ ప్రొఫెషనల్, ఫొటోగ్రాఫర్ నెవిల్లే కొనియాడారు. హైదరాబాద్‌లోని మైవే ఆర్గనైజేషన్ టూరిస్ట్ గైడ్ విడితిచౌదరీతో కలిసి శనివారం ఆయన భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించి అక్కడ మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్‌వస్త్రాలు, నూలు, రంగులద్దకం, టై అండ్ డై విధానంలో చిటికి కట్టడం, రంగులద్దకం తదితర వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియలతో పాటు ఇక్కడి గ్రామీణ ప్రజలు, చేతివృత్తుల జీవన విధానాలను తమ కెమెరాలో బంధించారు.

కొత్త రాతియుగపు నాటి గొడ్డలి లభ్యం


రాతి గొడ్డలిని చూపుతున్న ఈమని శివనాగిరెడ్డి

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో నాగులకట్ట వద్ద క్రీ.పూ. నాలుగు వేల సంవత్సరాల నాటి(కొత్త రాతి యుగం) రాతి గొడ్డలి లభ్యమైందని ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. పురాతన వారసత్వ సంపదను గుర్తించి, కాపాడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టరిటీ' కార్యక్రమంలో భాగంగా గుండ్రాంపల్లి గ్రామ శివారులోని ఏపూరు గ్రామానికి వెళ్లే దారిలో నాగుల కట్ట వద్ద శనివారం ఆయన చేపట్టిన పరిశోధనలో నల్లరాతితో చేసిన గొడ్డలి లభ్యమైందని తెలిపారు. ఆ గొడ్డలి 15 సెం.మీ. పొడవు, 6 సెం.మీ. వెడల్పు, 2 సెం.మీ. మందంతో ఉందని పేర్కొన్నారు. కొత్తరాతి యుగపు నాటి ఆనవాళ్లు బయటపడటం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. నాగుల కట్టపైన క్రీ.శ. 13వ శతాబ్దం నాటి కాకతీయు కాలంలోని చారిత్రక శిల్పాలున్నాయని వాటిని గ్రామస్తులు సంరక్షించుకోవాలని ఆయన కోరారు.

మత్స్యగిరి ఆలయంలో కేంద్ర ఐటీ శాఖ అదనపు డైరెక్టర్ పూజలు


పూజలు చేస్తున్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అదనపు డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాండే

వలిగొండ: మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అదనపు డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాండే సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి అనంతరం కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వాహణ అధికారి మోహనబాబు, ధర్మకర్తలు, పాల్గొన్నారు.

టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

చిట్యాల: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో టీవీఎస్ మోపెడ్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన దేశపాక ముత్తయ్య(60) టీవీఎస్ మోపెడ్‌పై వెలిమినేడు నుంచి వెళ్తుండగా.. గ్రామ శివారులో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

- రూ.లక్షల్లో వసూలు చేసి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో బురిడీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- తొమ్మిది మంది నుంచి రూ.45.10లక్షలు వసూలు
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరో నలుగురు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షల రూపాయలు వసూలు చేసిన కేటుగాళ్లను మిర్యాలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కె. రాజశేఖర రాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన ఖాసీం, ఎడ్ల చంద్రయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన రాసపుత్ర రాఘవేందర్ అలియాస్ రాజు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాళ్లపల్లి శ్రీధర్, రాళ్లపల్లి నారాయణ, రాళ్లపల్లి పార్వతమ్మ ముఠాగా ఏర్పడ్డారు. తనకు పెద్ద పెద్ద వారితో సంబంధాలున్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను గుర్తించి డబ్బులు వసూలు చేసి ఇస్తే కమీషన్ ఇస్తానని ఖాసీం చెప్పడంతో మిగతా వారు నిరుద్యోగులను గుర్తించి వారికి జాబ్ ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసేవారు. మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన వేముల వంశీకి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని రూ.12 లక్షలు వసూలు చేశారు. అదేవిధంగా ఏఎస్ఎం కాంట్రాక్ట్ జాబ్ కోసం మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డకు చెందిన వేమూరి రేణుక వద్ద రూ.3లక్షలు, తాళ్లగడ్డకు చెందిన కుప్పంపాటి పుష్పలతకు పాఠశాలలో అటెండర్ పోస్టు ఇప్పిస్తామని రూ.1.10 లక్షలు, రంగారెడ్డి జిల్లా కల్వకుర్తికు చెందిన సంగరమోని శ్రీనివాసులు, సంగరమోని హనుమంతుకు హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెరో రూ.6 లక్షలు, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుందేటి శ్రీహరి నుంచి రూ.6 లక్షలు, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం సజాపురం గ్రామానికి చెందిన లావురి నాగార్జునకు రైతు రుణాల రికవరీ ఏజెంట్ ఉద్యోగం కోసం రూ.1.50 లక్షలు, నల్లగొండ జిల్లా కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డికి కాంట్రాక్ట్ మ్యాన్‌పవర్ ఏజెన్సీ కోసం రూ.2.50 లక్షలు, మాడుగులపల్లి మండలం మాసినపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల శంకర్ వద్ద నుంచి కాంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం రూ.7లక్షలు వసూలు చేశారు.

రూ.45లక్షలకు పైగా వసూళ్లు..

తొమ్మిది మంది నిరుద్యోగుల నుంచి రూ.45.10 లోలు వసూలు చేసిన కేటుగాళ్లు 2023 సెప్టెంబర్ 15వ తేదీన బాధితుడు వేముల వంశీకి హోంగార్డు ఉద్యోగం ఇచ్చినట్లు ఒక ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. అది ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ అని తెలవడంతో తన డబ్బులు తనకు ఇవ్వాలని వంశీ ఒత్తిడి చేశాడు. అప్పటి నుంచి డబ్బుల కోసం వారిని వేడుకుంటున్నా ఇవ్వకపోవడంతో విసిగి వేసారిన వంశీ ఇటీవల పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మిర్యాలగూడ పట్టణంలోని గ్రామీణ ఉద్యోగ సేవా కేంద్రంలో నిందితులు రాసపుత్ర రాఘవేందర్, రాళ్లపల్లి శ్రీధర్‌ను అరెస్ట్ చేశారు. ఖాసీం, ఎడ్ల చంద్రయ్య, రాళ్లపల్లి నారాయణ, రాళ్లపల్లి పార్వతమ్మ పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ నాగార్జున, టూటౌన్ ఎస్ఐ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.